క్లుప్తంగా

అబ్దుల్ కలామ్, రతన్ టాటాలకు నివాళి



అబ్దుల్ కలామ్, రతన్ టాటా చిత్ర పటాలవద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గాజువాక : భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్, భారత వ్యాపార దిగ్గజం రతన్ టాటాలకు స్థానిక ట్వింకిల్ కిడ్స్ స్కూల్ విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో అమెరికాకు చెందిన ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ చెసాపీక్ యుటిలిటీస్ కార్పొరేషన్ సహాయ ఉపాధ్యక్షుడు పురోగామి, రైజ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్లు హరి వెంకటేష్, చిత్రలేఖదేవి తదితరులు అబ్దుల్ కలామ్, రతన్ టాటా చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురోగామి మాట్లాడుతూ కలామ్, రతన్ టాటా లాంటి మహనీయుల జీవిత చరిత్రలను విద్యార్థులు తెలుసుకుని ఆ స్ఫూర్తితో అత్యున్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విలువలతో జీవించడం వల్లే అబ్దుల్ కలామ్, రతన్ టాటా ఇంతటి ఖ్యాతిని పొందారని తెలిపారు. ఈ సందర్భంగా కలామ్, రతన్ టాటా జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి.శ్యామ్, ప్రిన్సిపాల్ ఎస్.కరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ మేనేజ్‌మెంట్‌లో రత్నకుమారికి డాక్టరేట్



రత్నకుమారిని అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

ఉక్కునగరం: ఆంధ్ర విశ్వవిద్యాయలం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు మాటూరి రత్నకుమారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. విభాగం ఆచార్యులు, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పర్యవేక్షణలో ‘హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ పబ్లిక్ సెక్టార్ – ఎ స్టడీ ఆన్ సెలెక్ట్ పబ్లిక్ సెక్టార్ ఆర్గనైజేషన్స్ ఇన్ విశాఖపట్నం’ అనే అంశంపై జరిపిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూలో జరిగిన కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరించారు. మాటూరి రత్నకుమారి ప్రస్తుతం ఎస్ఎస్‌టీఏల్‌లో ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం పట్ల ఆమెను గైడ్ ఆచార్య వి.కృష్ణమోహన్, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ జలాది రవి అభినందించారు.

సీఎం సహాయ నిధికి విరాళం



ఏయూ రిజిస్ట్రార్‌కు చెక్కు అందజేస్తున్న కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి

గాజువాక : స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యం వరద బాధితుల సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2 లక్షల విరాళాన్ని అందజేసింది. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ద్వారా రూ.1,11,111, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా రూ.లక్షను అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు, ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావుకు కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి, డైరెక్టర్ ఎస్.కామేశ్వరి మంగళవారం అందజేశారు.

శిథిల భవనాలతో
భయం...భయం

- కూలడానికి సిద్ధంగా ప్రభుత్వ భవనాలు
- శిథిలావస్థకు చేరిన భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

శిథిల భవనాలతో ప్రమాదం పొంచివుంది. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితిలో ఆ కట్టడాలు ఉన్నాయి. వాటిలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తుండడంతో తల్లిదండ్రులు, కేంద్రాల నిర్వాహకులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అధికారులకు తెలియజేసినా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.



యాతపాలెంలో శిథిలావస్థకు చేరిన తుఫాన్ భవనం



గంగవరం పాఠశాలను ఆనుకుని ఉన్న శిథిలావస్థకు చేరిన తుపాను భవనం



గొడ్డువాని పాలెంలో అంగనాడీ కేంద్రం భవనం లోంచి పెరిగిన మర్రిచెట్టు ఊడలు

పెదగంట్యాడ: అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ భవనాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఆలనా పాలనా కరవవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఏ భవనం ఎప్పుడు కూలుతుందో.. ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పెదగంట్యాడ మండలంలోని 64వ వార్డు గొడ్డువానిపాలెం, యాతపాలెం, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకుని, ఇతర ప్రాంతాల్లో ప్రజల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని రెండు దశాబ్దాల క్రితం సామాజిక భవనాలు నిర్మించారు. అప్పట్లో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన భవనాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు ఆశ్రయం కల్పించేందుకు వీటిని వినియోగించుకోవాలన్న సదుద్దేశంతో అప్పటి ప్రభుత్వాలు నిర్మించాయి. అంతవరకూ బాగానే ఉన్నా.. భవనాల వద్ద కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశం నెరవేరకపోగా అక్రమ కార్యకలాపాలకు నిలయాలుగా మారిపోయాయి. నిర్వహణ లేకపోవడంతో రానురాను ఆ భవనాలు శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా మారాయి. ప్రతి భవనం నుంచి పెచ్చులూడి పడిపోతుండడంతో ఎప్పుడు కూలిపోతాయోనన్న భయం అందరిలో నెలకొంది. ప్రస్తుతం ఆ భవనాల్లో కొన్నింటిని అంగన్‌వాడీ కేంద్రాలుగానూ, మరికొన్నింటి పశువులకు ప్రథమ చికిత్స అందించే కేంద్రాలుగానూ వినియోగిస్తున్నారు. ఎప్పుడో ఏళ్లనాటి కట్టడాలు కావడంతో కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నపిల్లలపై ఎప్పుడు పెచ్చులు ఊడి పడిపోతాయోనన్న భయంతో నిర్వాహకులు,చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు చేపట్టాల్సిన జిల్లా యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం సున్నం వేయడానికి ఏ అధికారీ ముందుకు రాలేదు. 64వ వార్డులోని గొడ్డువానిపాలెం సామాజిక భవనం పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆ భవనం నుంచి ఒక మర్రిచెట్టు పుట్టుకొచ్చి పెద్ద వృక్షంగా మారిపోవడంతో ఏక్షణాన్నైనా కూలిపోయే ప్రమాదం ఉంది. ఆ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రానికి సుమారు 25 మంది పిల్లలు వస్తున్నారు. ఏదైనా ప్రమాదం ముంచుకొస్తే పిల్లల పరిస్థితి ఏంటో తమకే అర్థం కావడం లేదని అంగన్‌వాడీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాలపై కేంద్రాల నిర్వాహకులు, సామాజిక కార్యకర్తలు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకునే దాఖలాలు కనిపించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గంగవరం హైస్కూల్‌కి ఆనుకుని ఉన్న సామాజిక భవనం పరిస్థితి దారుణంగా ఉంది ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఇటు పాఠశాల సిబ్బంది, అటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పిల్లల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు



అవగాహన ర్యాలీ లో పాల్గొన్న శ్రీనివాసరావు

పెదగంట్యాడ: పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారి ఇమండి శ్రీనివాసరావు అన్నారు. పెదగంట్యాడ భవిత కేంద్రం నుంచి నెల్లిముక్కు, కోరాడ, సీతానగరం తదితర ప్రాంతాల్లో భవిత కేంద్రం విద్యార్థులకు సంబంధించి నిర్దిష్ట అభ్యస వైకల్యాల (డిస్లెక్సియా) పై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థుల అభ్యసనలో లోపాలు ఉంటాయని, వాటిని గుర్తించి, ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు ఎం.సూర్యనారాయణ, బి.విజయభారతి పాల్గొన్నారు.

20న ‘ఐక్యరాజ్య సమితి’పై పోటీలు

తగరపువలస: ఐక్యరాజ్యసమితి స్థాపించి ఈ నెల 24తో 79 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఈ నెల 20న జిల్లా స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి 24న బహుమతులు అందిస్తామని మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. మరిన్ని వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

అస్తవ్యస్తంగా మైదానం



బురదమయంగా ఉన్న అక్కిరెడ్డిపాలెం అమ్మవార్ల ఆలయ మైదానం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ఎదురుగా గల కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల ఆలయ మైదానం అస్తవ్యస్తంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పూర్తిగా బురదమయంగా మారింది. మైదానంలో కమ్యూనిటీ హాలు నిర్మించడంతో ఇప్పటికే కుచించుకుపోయింది. ఇక్కడ వివాహాలు, పుట్టిన రోజు వేడుకలు వంటి శుభ కార్యక్రమాలు నిర్వహించే వారు, ఇక్కడ వాహనాలు పార్క్ చేస్తున్న వ్యాపారులు వ్యర్థాలను పడేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మైదానంలో కొంతభాగాన్ని శుభ్రం చేసి హై స్కూల్ విద్యార్థులు ఆటలు ఆడేందుకు వినియోగించేవారు. కానీ మైదానం పూర్తిగా పాడైపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, గ్రామ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు స్పందించి మైదానాన్ని శుభ్రపరచాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పాఠశాల అదనపు గదులు,సైన్స్ ల్యాబ్ ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, కోరమాండల్ అధికారులు

మల్కాపురం: 58వ వార్డు శ్రీహరిపురం వద్ద గల జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభోత్సవానికి నోచుకున్నాయి. పాఠశాలలో రెండు అదనపు గదులు, ఒక సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి కోరమాండల్ ఇంటర్ నేషనల్ సంస్థ సుమారు రూ.28 లక్షల తన సీఎస్ఆర్ నిధులు సమకూర్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అప్పటి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చేతుల మీదగా నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఈ ఏడాది జూన్ నాటికి 90 శాతం పనులు పూర్తి అయ్యాయి.కొత్త ప్రభుత్వం రావడంతో ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు అదనపు గదులు ప్రారంభానికి నోచుకున్నాయి.దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో తమ ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్ నేషనల్ సంస్థ అధికారులు జ్ఞానసుందరం, ఆర్.శ్రీనివాస్‌రావు, జైగోపాల్,శ్రీకాంత్‌లతో పాటు వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను,మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి,తెలుగు యువత నాయకులు రామ్మోహన్‌నాయుడు, పొత్తబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావంలో అమృతరావు పాత్ర మరువరానిది



అమృతరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావంలో దివంగత టి.అమృతరావు పాత్ర మరువరానిదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ కోసం అమృతరావు విశాఖ కలెక్టరేట్ దగ్గర అమరణ నిరాహార దీక్ష చేసి నేటికి 59 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయనకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విశాఖలో కాకుండా కర్ణాటకకు తరలించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్న తరుణంలో అమృతరావు గుంటూరు నుంచి విశాఖ వచ్చి తన ప్రాణాలకు తెగించి అమరణ దీక్ష చేశారన్నారు. ఆయన దీక్ష వల్ల రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారి 32 మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. ఆయన దీక్షకు దిగి వచ్చి నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి విశాఖ వచ్చి ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారన్నారు. ఆయనను స్మరించుకోవడం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అన్నారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, నరేంద్ర, సుదర్శనం, ఎల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహం చేతిపై ఈగల్ పచ్చబొట్టు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరానికి మంగళవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానిక మత్స్యకారులు గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు... తీరానికి చేరిన మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. శరీరంపై దుస్తుల్లేవు. కుడి చేతిపై ఎగురుతున్న ఈగల్ బొమ్మతో పాటు 27, ఎస్ డబ్ల్యూ ఎఫ్, ఎడమ చేతిపై 8 అండ్ సింబల్ పచ్చబొట్టు ఆనవాళ్లు ఉన్నాయి. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండడంతో 15 రోజుల క్రితం మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన తప్పిపోయిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మృతదేహన్ని గుర్తించిన వారు 9440796038 నంబరును సంప్రదించాలన్నారు. మృతదేహన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక : రాష్ట్రంలో నిత్యావసర సరకుల ధరలు దారుణంగా పెరిగిపోతున్నాయని సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో మంగళవారం ఆందోళన చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త గాజువాక మార్కెట్‌వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలను కట్టడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కందిపప్పు, వంట నూనె, ఉల్లిపాయలు, టమాటా ధరలతోపాటు కూరగాయల ధరలు మండిపోతున్నాయని తెలిపారు. పెరిగిపోతున్న ధరలతో మధ్య తరగతి, పేద ప్రజలు విలవిల్లాడుతున్నారన్నారు. నిత్యావసర సరుకులను రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్ డిపోలద్వారా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లేటి పోలయ్య, కె.అచ్యుతరావు, ఎ.విష్ణు, పి.దుర్గారావు, కె.వనజాక్షి, పి.పద్మ, పప్పు అప్పారావు, ఎం.అప్పారావు, మురళి, శేఖర్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

‘హైస్కూల్ సమీపంలో మద్యం షాపు వద్దు’



జెడ్పీ హైస్కూల్‌కు సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అతి సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని వేరొక ప్రదేశానికి తరలించేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు బండారు రామునాయుడు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలకు సమీపంలో మద్యం దుకాణం ఉంటే విద్యార్థులపై చెడు ప్రభావం చూపే ప్రమాదముందన్నారు. నిబంధనల మేరకు గుడి, బడికి సమీపంలో మద్యం షాపుల్ని ఏర్పాటు చేయరాదన్నారు. ఈ మద్యం షాపును తరలించాలని ఇప్పటికే స్థానిక ప్రజలు ఎక్సైజ్ అధికారుల్ని అభ్యర్థించినా, పట్టించుకోలేదన్నారు. ఈ మద్యం దుకాణాన్ని దాటుకుంటూనే విద్యార్థులు రాకపోకలు సాగించాలని, ఇక్కడ మందుబాబుల ఆగడాలు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని తక్షణమే వేరే చోటుకి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారుల్ని ఆ ప్రకటనలో కోరారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు.

వావ్.. వాన విల్లు



రంగు రంగుల రెయిన్‌బో కనువిందు చేసింది. మండల పరిధిలోని స్టీల్‌ప్లాంట్ బీసీ గేట్ వద్ద మంగళవారం వేకువజామున కనిపించిన ఈ దృశ్యాన్ని చూసిన కార్మికులతో పాటు, స్థానికులు తమ సెల్‌ఫోన్ల కెమెరాల్లో బంధించారు.

–పెదగంట్యాడ

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కోస్టల్ బ్యాంకు సీవోవో హేమంత్ కుమార్



బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హేమంత్ కుమార్

విశాఖ విద్య: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్టు కోస్టల్ బ్యాంకు చీఫ్ ఆపరేటింగ్ అధికారి పి.హేమంత్ కుమార్ అన్నారు. ఎన్ఏడీ సమీపంలోని బుచ్చిరాజుపాలెంలో కోస్టల్ బ్యాంకు గోపాలపట్నం బ్రాంచి కార్యకలాపాలను విశాలమైన భవనంలోకి మార్పు చేశారు. దీనిని బుధవారం ఆయన ప్రారంభించారు. బ్రాంచిలో ఖాతా దారుల సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులకు నమ్మకమైన సేవలు అందిస్తున్నందున వల్లే బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలు పురోగమిస్తున్నాయన్నారు. తక్కువ వడ్డీకే రుణాలు సకాలంలో ఇవ్వడంతో పాటు, డిపాజిట్ దారులకు లాభదాయకమైన వడ్డీ అందిస్తున్నట్లు చెప్పారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యూపీఐ సేవలు విస్తరిస్తున్నామని, వీటిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ యు. తులసీరావు, క్లస్టర్ హెడ్ వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతరకు ఆహ్వానం



డాక్టర్ సాయిరాం

పరవాడ: అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర వరల్డ్ రికార్డులో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు కవి,రచయిత,గాయకుడు,సామాజిక వేత్త ఎంఎస్ఎస్ సాయిరాంమంగళవారం మీడియాకుతెలిపారు. ఆయన గత కొంత కాలంగా పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో సామాజిక రచనలు, వివిధ సాహితీ ప్రక్రియలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం ఆయనకు ఉంది. ఆహ్వానం అందుకున్న సాయిరాంను పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ జయశ్రీ, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్ అభినందించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

సబ్బవరం: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణను మండల వీఆర్వోలు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు నీటిపల్లి గంగాధరరావు అధ్వర్యంలో పలువురు వీఆర్ఏలు మంగళవారం కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న వీఆర్ఏల పోస్టుల్లో కొత్తవారితో నియమించేలా చూడాలని విన్నవించారు.